క్లుప్తంగా

బీసీల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న రవీందర్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా రూ. 20 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ రవీందర్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ దాసరి ఉష ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం 31వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా రిలేదీక్ష శిబిరం వద్ద రవీందర్ మాట్లాడారు. బీసీగణన చేపట్టాలని, రిజర్వేషన్లను 52శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, శారద, సతీష్‌తో పలు ప్రాంతాలనుంచి వచ్చిన మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజూ విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రామగుండం: నూతన వేతన సవరణతో పాటు వివిధ సమస్యల పరిష్కారానికి ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. దీనిలో భాగంగానే శనివారం రామగుండం బీ-థర్మల్ ఉద్యోగులు రెండో రోజు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో లగిశెట్టి రవికుమార్, బొడ్డు యాదగిరి, నర్సింహులు, నూనె రాజు, శశికాంత్‌సింగ్, గుర్రం కుమారస్వామి, అబ్దుల్ తఖీ తదితరులున్నారు.

ముగిసిన స్వచ్ఛభారత్ శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

జూలపల్లి: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ మూడు రోజుల శిక్షణ శనివారంతో ముగిసింది. గ్రామాల్లో స్వచ్ఛ భారత్ అమలు, చేపట్టవలసిన సర్వే వివరాలు, ప్రయోగాత్మక పరిశీలన ,గ్రూపులుగా విభజించి, పరిశుభ్రత, పచ్చదనం, నీటి పునర్వినియోగం, ఐఎస్ఎల్‌పై చర్చించడం లాంటి శిక్షణను నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ జిల్లా కో ఆర్డినేటర్ రాఘవులు, ఎంఐఎస్ రేణుక, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఏపీఎం సుధాకర్, ఏపీవో సదానందం, ఏఈ సువిశాల, పంచాయతీ కార్యదర్శులు లచ్చయ్య, అర్చన, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ఖాళీ క్వార్టర్లు కేటాయించాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలోని ఖాళీ క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని టీడీపీ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. క్వార్టర్లు కూలిపోయేదాక చూస్తున్నారని, కాంట్రాక్టు కార్మికులకు మాత్రం ఇవ్వడం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలన్నారు. సమానపనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కోలిండియాలో అమలవుతున్న జీతాలు కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాలన్నారు.సమావేశంలో నాయకులు కంది చంద్రయ్య, ముదుగంటి దామోదర్‌రెడ్డి, సంగం రాజు, సంగం రాజు, కోటగిరి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

యైటింక్లయిన్‌కాలనీ:రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ పద్మశాలి సేవా సంఘం నూతన కమిటీని శుక్రవారం హనుమాన్‌గన్‌లోని హనుమాన్ ఆలయ ఆవరణంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుండేటి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా దేవనపల్లి చక్రపాణిని ఎన్నుకున్నారు. మహిళాసంఘం కమిటీ తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. పద్మశాలి సేవా సంఘం సభ్యులు రాజమల్లు, లింగయ్య, వెంకట నర్సయ్య, రాజేశ్, సమ్మయ్య, శంకర్, ఓదెలు పాల్గొన్నారు.





పర్యాటకంపై ఆశలు..

బడ్జెట్‌లో కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్‌కు రూ.750 కోట్లు కేటాయింపు

- కోటిలింగాల టూ ఎల్లంపల్లి బోటింగ్ పునః ప్రారంభానికి అవకాశం
- వృథాగా స్పీడ్‌బోట్‌లు

రామగుండం: పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం కాళేశ్వరం టూరిస్ట్ సర్క్యూట్‌కు రూ.750 కోట్లు కేటాయించింది. దీంతో పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు పర్యాటక శోభ వస్తుందని పర్యాటకుల్లో ఆశలు పెరిగాయి. ప్రాజెక్టుకు ఇరువైపులా మంచిర్యాల, అంతర్గాం వైపు కరకట్టపైన బీటీ డబుల్ రోడ్డు నిర్మాణంతో రెండు జిల్లాల నుంచి పర్యాటకుల సందడి నెలకొంది. ఇంతకు ముందే వెల్గటూర్ మండలం కోటిలింగాల నుంచి బోటింగ్‌ను మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించినప్పటికీ, వరదలతో కొద్ది రోజుల్లోనే నిలిపివేశారు. దశల వారీగా కోటిలింగాల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు వయా లక్సెట్టిపేట, ధర్మపురి మీదుగా వరద నీటిలో 20 కిలోమీటర్లు బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలు తిలకించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ, కార్యరూపం దాల్చకపోవడంతో పర్యాటకులు నిరుత్సాహ పడుతున్నారు. ఇప్పటికే మూడు రకాల బోట్లు కోటిలింగాల ఆలయ ప్రాంగణంలో ఉన్నాయి. ఇందులో పులోమావి బోట్ -30 సీట్ల సామర్థ్యం, శాతకర్ణి-50 సీట్లు, స్పీడ్‌బోట్-5 సీట్ల సామర్థ్యంతో తీసుకువచ్చిన నాణ్యమైన బోట్లు వృథాగా పడి ఉన్నాయి. ప్రాజెక్టు పరిసరాల్లో స్టాల్స్, అందమైన పార్కులు, తాగునీటి, మరుగుదొడ్ల వసతి, ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తే ఊహించనంతగా పర్యాటకం అభివృద్ధి చెంది ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

మానసిక ప్రశాంతత..



విధి నిర్వహణలో ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతున్న క్రమంలో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చి కూర్చుంటే చల్లటి గాలి, నీటి అలలు, స్వచ్ఛమైన వాతావరణం ఇవన్నీ మానసిక ఒత్తిడిని దూరం చేస్తాయి. ప్రస్తుతం రహదారి నిర్మాణంతో ఠక్కున కుటుంబసభ్యులతో ప్రాజెక్టుకు వచ్చే అవకాశం ఉంది. బోటింగ్ ఏర్పాటు చేయాలి.
- ఎండీ.యూసుఫొద్దీన్, కాంట్రాక్టర్, రామగుండం

రహదారి నిర్మాణంతో ప్రయాణం సులువైంది



ఇప్పటివరకు రాళ్లు తేలిన రహదారిపై ప్రాజెక్టుకు చేరుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు డబుల్ రోడ్డు నిర్మాణంతో పది నిమిషాల్లోనే చేరుకున్నా. ప్రాజెక్టుకు ఇరువైపులా ఉద్యానవనాలు, జూ పార్కు, చిల్డ్రన్ పార్కు, బోటింగ్ ఏర్పాటు చేస్తే ఒక్కసారిగా పర్యాటకులు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఆ దిశగా పాలకులు, ప్రభుత్వం ఆలోచించాలి.- బాణాల శ్రీధర్, మంచిర్యాల

బంధువులు వచ్చిన ప్రతీసారి వస్తాం



మా ఇంటికి బంధువులు వచ్చిన ప్రతీసారి కుటుంబసమేతంగా బంధువులతో ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు భోజనం సిద్ధం చేసుకుని వస్తుంటాం. ప్రస్తుతం రహదారి పూర్తవడంతో తాగునీటి వసతి, పర్యాటకులు కూర్చొని గోదావరి అందాలను తిలకించేందుకు అందమైన ప్లాట్‌ఫారమ్స్, సీసరీస్ ఏర్పాటు చేయాలి. - కోమళ్ల మహేశ్, టీచర్, గోదావరిఖని

గ్రామదేవతలకు మొక్కులు



మొక్కులు చెల్లించుకుంటున్న తహసీల్దార్

రామగిరి: మండలంలోని పన్నూరులో జరుగుతున్న శ్రీ భూదేవి సహిత బొడ్రాయి, శ్రీ మహాలక్ష్మీ ప్రతిష్ఠ, పోచమ్మ కొలుపు ఉత్సవాల్లో భాగంగా శనివారం తహసీల్దార్ చల్లా రాంమోహన్ సందర్శించి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మ్యాదరవేణి కుమార్ యాదవ్, ఎంపీటీసీ చిందం మహేష్, బీఆర్ఎస్ నాయకులు అల్లం తిరుపతి, శ్రీనివాస్, ఆరు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



మునీర్ బేగ్ మృతదేహం

రామగిరి: మండలంలోని బేగంపేటకు చెందిన మీర్జా మునీర్ బేగ్(42) జీవితంపై విరక్తితో శనివారం వేకువజామున బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మునీర్ బేగ్ హమాలీ. 2018లో కాలు విరగడంతో ఇంటివద్దనే ఉంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఉదయం 3.30 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లిపోయాడు. కుమారుడు ఆర్బస్ నిద్రలేచి చూసేసరికి బేగ్ కనిపించలేదు. కుటుంబసభ్యులు వెతుకుతుండగా గ్రామ పంచాయతీ బావిలో శవమై కనిపించాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తల్లి మీర్జా జిలానీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గోదావరిఖని: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఐ.కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను మార్చి కోడ్‌లు రూపొందించారన్నారు. నవరత్న, మినీరత్నగా వెలుగొందుతున్న పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మార్చి 18,19తేదీల్లో జ్యోతినగర్ టీవీగార్డెన్‌లో నిర్వహిస్తున్న పెద్దపల్లి జిల్లా 9వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎ.వెంకన్న, ఇ.నరేష్, చిలుక శంకర్, మల్యాల దుర్గయ్య, కొండ్ర మొగిలి, ఎం.కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనమివ్వాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు కనీసం రూ.26 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పంచాయతీ కార్మికులపై పనిభారం పెంచేలా ఉన్న మల్టీపర్పస్ వర్కర్ పద్ధతిని రద్దుపర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖాజా, తిరుపతి, ముస్తఫా, రాజయ్య, శారద, అశోక్, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



గర్రెపల్లిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం, మండలం, సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఎలిగేడు, ఓదెల మండలాల్లోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ స ందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులున్నారు. - సాక్షి, నెట్‌వర్క్

గీత కార్మికుడికి బీసీ కార్పొరేషన్ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న అధికారులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు మేర్గు లక్ష్మీపతిగౌడ్ జనవరి 6 న ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కిందపడిపోయాడు. ఈ నేపథ్యంలో తీవ్రగాయాలపాలైన లక్ష్మీపతి గౌడ్‌కు బీసీ కార్పొరేషన్ నుంచి తక్షణసాయం కింద రూ.15 వేలు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో పెద్దంపేట సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ, జెడ్పీటీసీ ఆముల నారాయణ, గీత కార్మిక సంఘం అధ్యక్షుడు మేర్గు రమేశ్ గౌడ్, సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మూల మల్లేషం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీకి హాజరైన జిల్లా కాంగ్రెస్ నాయకులు



ప్లీనరీ వద్ద జిల్లా కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖని: రాయ్‌పూర్‌లో జరుగుతున్న భారత జాతీయ కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశాలకు ఏఐసీసీ ఆహ్వానం మేరకు పెద్దపల్లి జిల్లా నుంచి పలువురు నాయకులు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్, మాజీ అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య, గుమ్మడి కుమారస్వామి, బొంతల రాజేశ్, దాసరి విజయ్‌కుమార్ హాజరయ్యారు.

జర్నలిస్టుల నిరసన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలోని సుద్దాలలో బీజేపీ కార్నర్ మీటింగ్ కవరేజీ వెళ్లిన మీడియా ప్రతినిధులపై అధికారపార్టీ నాయకులు చేసిన దాడిని ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు కొట్టెసదానందం తదితర నాయకులు ఖండించారు. దాడికి పాల్పడిన అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి జర్నలిస్టులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అవతార్ మెహర్‌బాబా జయంతి



కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్

గోదావరిఖనిటౌన్: స్థానిక కళ్యాణ్‌నగర్‌లోని మెహర్ బాబా మందిరంలో నిర్వాహకులు విషంశెట్టి రాంమోహన్‌రావు కుమారుడు విషంశెట్టి శ్రీనివాస్,రాజారాణి ఆధ్వర్యంలో బాబా129వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భక్తులు మెహర్‌బాబా జెండా ఆవిష్కరించి, ఆయన చిత్రపటాన్ని భక్తులు కోలాట నృత్యాలతో ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్ చేతుల మీదుగా కేక్ కట్‌చేసి, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కైలాసం, శ్రీహరి, శ్రీరాములు, శ్రీనివాస్, సంతోష్, ఆర్.ముత్యం, సదానందం, అంజయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ చికిత్సకు సాయం చేయాలి



ఆదుకోవాలని వేడుకుంటున్న బాధితుడి భార్య

గోదావరిఖనిటౌన్: ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బీర విజయ్‌ను దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, బొడ్డు రవీందర్, కార్పొరేటర్ రజిత కోరారు. శనివారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. విజయ్ శస్త్ర చికిత్సకు దాదాపు రూ.6 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని, పేదరికంతో ఆటోమీద ఆధారపడి జీవనం సాగిస్తున్న తనకు వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇంటికి వచ్చారని, ప్రస్తుతం కుటుంబం పూట గడవలేని స్థితిలో ఉందన్నారు. ఎమ్మెల్యేతో మాట్లాడి ఎల్‌వోసీ వచ్చే విధంగా చూస్తానని పేర్కొన్నారు. దాతలు ముందుకొచ్చి 9849530524 సెల్ నెంబర్‌లో సంప్రదించి సహాయం చేయాలని ఆయన కోరారు. బాధితుడు విజయ్ భార్య మాట్లాడుతూ దాతలు ఆదుకోవాలని దీనంగా వేడుకున్నారు.

సంక్షిప్త వార్తలు

జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ మాతంగి శ్రీధర్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి వచ్చిన సందర్భంగా కళాశాలలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఖాజా జహీరాబార్ అహ్మద్ మాట్లాడుతూ శ్రీధర్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి లభించడం చాలా ఆనందంగా ఉందని మరిన్ని పదవులు లభించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది గడ్డం శ్యామ్‌కుమార్‌గౌడ్, జెట్టి రాము, కాంపెల్లి సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి గ్రామానికి చెందిన న్యాతరి లచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ అందించిన రూ.4 వేల ఆర్థికసాయం కేసీఆర్ సేవాదళం ఎలిగేడు మండల అధ్యక్షుడు బింగి రాజు చేతుల మీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధానకార్యదర్శి శాతల్ల కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడిగా రమేశ్

రామగుండం: పట్టణ పరిధిలోని ఒకటో డివిజన్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడిగా సాదు రమేశ్‌ను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సాదు రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి కట్టబెట్టిన ఠాకూర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ అధికారి తనిఖీ

మంథని: పట్టణంలోని పలు దుకాణాల్లో పెద్దపల్లి అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ అధికారి రాంప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. జీఎస్టీ చెల్లింపుపై దుకాణాల్లో ఆరా తీశారు. అవకాశం ఉండి జీఎస్టీ చెల్లించని దుకాణాల వివరాలను సేకరించినట్లు సమాచారం.

గుంపులలో వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంపులలో ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. జమ్మికుంట, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ వైపులకు వెళ్లే అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..!





విహారయాత్రలో మల్కాపూర్, నర్రాశాలపల్లె ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

జ్యోతినగర్: విద్యార్థులకు తరగతిలో గదిలో నేర్పించే విజ్ఞానంతో పాటు వారి ఆహ్లాదం కోసం విద్యార్థులను ఉపాధ్యాయులు విహారయాత్రకు తీసుకెళ్లారు. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లోని మల్కాపూర్, నర్రాశాలపల్లెకు చెందిన ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎం విద్యార్థులను శనివారం బస్సులో తీసుకెళ్లి ఎలగందల్ ఖిల్లాతో పాటు కరీంనగర్‌లోని ఉజ్వల పార్కు, డీర్ పార్కు, మానేరు డ్యాంను చూపించి వారిని ఆనందపరిచారు. విద్యార్థులు విహారయాత్రలో వివిధ రకాల పక్షులను చూస్తూ, ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ, ఆటలాడుకున్నారు. మల్కాపూర్, నర్రాశాలపల్లె పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.